అతని
ఆదర్శాలను
నమ్మిన ఆమెకు
తెలిసిన నిజం


# ఆషాఢభూతి

వి.వి. సీతారామబాబు కథ

ఆనందరావొక అభ్యుదయ రచయిత. సంఘంలోని దురాచారాలను ముఖ్యంగా స్త్రీలపట్ల జరిగే అత్యాచారాలను ఘాటుగా విమర్శిస్తూ వుంటాడు. వరకట్నం, సాంఘిక, ఆర్థిక, సామాజిక పరంగా స్త్రీలకు జరిగే అన్యాయాల్లో పురుషులు ఎంత క్రూరంగా వ్యవహరిస్తారో మానవత్వాన్ని ఎంత లోతుకు మట్టిలో కలుపుతారో కళ్లకు కట్టినట్టు చిత్రీకరించడంలో సిద్ధహస్తుడు. 'అనాథ నాథ' అనే కలంపేరుతో 'అబలావాణి' అనే వారపత్రికలో తరచూ అతని రచనలు ప్రచురితమవుతాయి. అది చదివినవారు ముఖ్యంగా స్త్రీలు, చాలా ప్రభావితమవుతారు. అటువంటి ఆదర్శభావాలు కలిగిన వ్యక్తి తమ జీవిత భాగస్వామి కావాలని కలలు కనేవారు.

అనూరాధ ఒక బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్నది. తండ్రి బడిపంతులు పనిచేసి రిటైరయ్యాడు. మొదట ఇద్దరు కూతుళ్లనూ ఎలాగో ఒక ఇంటివారిని చేయడంలో ఆయన ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా చాలా కృంగిపోయాడు. తన పెన్షనుతో సంసారం గడుపుతూ, అనూరాధ జీతాన్ని వెనకేస్తున్నాడు. అమ్మాయి ఉద్యోగం, మంచి బుద్ధీ, చూసి ఎవరైనా కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నా కనీసం పెళ్లి ఖర్చులకైనా కొంత డబ్బు కావాలికదా.

ఆనందరావు రచనలవల్ల ప్రభావితమైన వేలాదిమందిలో అనూరాధ ఒకతె. 'అనాథ నాద' అనే కలంపేరుతో రచనలు చేస్తున్న వ్యక్తి రచయితో రచయిత్రో తెలియకపోయినా రచయితే అయివుండాలన్న ఆశతో ఆ



ప్రతికాపీను సంప్రదించి, అతని ఎడ్రసు కనుక్కున్నది. అతను రచయితేననీ, తనలాగే వేరొక బాంకులో క్లర్కుగా పనిచేస్తున్నాడనీ తెలిసి పరమానందం పొందింది. కలంస్నేహం, ఫోనుస్నేహం, కాంటీనుస్నేహం, పార్కుస్నేహం, సినేమాహాలుస్నేహం, ఇలా అంచెలంచెలుగా వారి స్నేహం వర్ధిల్లింది.

ఈ పరిచయకాలంలో ఆమెకు రచయిత

ఆనందరావే నిజజీవితంలో కూడా కనిపించా డు. ఇలా మాటలూ, చూపులూ, చేతులూ , మనసులూ కలిసినా వారు తనువులు మాత్రం కలియకుండా జాగ్రత్తపడేవారు. ఆ జాగ్రత్త స్త్రీ సహజమైన ముందుచూపు గా ఆనందరావు భావిస్తే, స్త్రీలపట్ల ఆనంద రావుకున్న సహజమైన గౌరవంగా అనూరాధ భావించేది.

స్వపరిచయాలతోపాటు, కుటుంబ పరి చయాలుకూడా మొదలయ్యాయి. ఇంక ఈ మూడోపిల్లకు కూడా మూడు ముళ్లా వేయించేస్తే, తనకు వచ్చే పెన్షనుతో, ఏ వృద్ధాశ్రమంలోనో రామా కృష్ణా అంటూ గడుపుకోవచ్చని సంబరపడ్డాడు అనూరాధ తండ్రి. ఆనందరావు తనతో మాటాడే తీరూ, వెలిబుచ్చే అభిప్రాయాలూ విన్న తర్వాత, అతను ప్రస్తుత విషపూరిత సమాజ వాతావరణానికి అతీతుడనిన్నీ, కట్న కానుకలాశించడనీ, అనూరాధ జీతంతో కూడబెట్టిన నాలుగు డబ్బులతో పెళ్లిచేసి తన బాధ్యతలను వదుల్చుకుంటే ఆనందరా వు తోడుతో, అతని నీడలో అనూరాధ జీవితం ఆనందమయంగా గడిచిపోతుందన్న నిర్ణయానికి వచ్చారు.

ఆధునిక భావాలున్న ఆనందరావు పట్టిం చుకోకపోయినా, సాంప్రదాయాన్ననుసరించి ఆడపిల్ల తండ్రిగా, ఆనందరావు తల్లిదండ్రు ల దగ్గరకు వెళ్లి పెళ్లి ప్రతిపాదన పెట్టాడు అనూరాధ తండ్రి. ఆనందరావుమీద, అత ను తెచ్చే కట్నకానుకలమీద, ఎక్కువ ఆశలు పెట్టుకోని అతని తల్లిదండ్రులు, అంతా అతని ఇష్టానికే వదిలేశారు.

ఆకాశమంత పందిరీ, భూదేవంత మం టపమూ వెయ్యకపోయినా అనూరాధ దాచి న డబ్బుతో బాగానే పెళ్లి జరిపించాడు ఆమె తండ్రి. తన ఇంట్లోవున్న సామానులలో, అనూరాధకుపయోగపడేవాటినన్నింటినీ సా రెగా ఇచ్చి అత్తవారింటికి పంపించాడు. నూతన దంపతులు ఒక వారం రోజులు సెలవు తీసుకుని హనీమూన్ పూర్తిచేసుకుని వచ్చారు. ఆనందరావు వుంటున్న ఇల్లు బ్రహ్మచారి కొంప అయినా, ఫామిలీ వుండ డానికి అన్ని వసతులూ వుండడంవల్ల అందులోనే కంటిన్యూ చేయడానికి నిశ్చయి ంచారు.

ఆరోజుతో ఇద్దరి సెలవులూ పూర్తయి పోయాయి. డ్యూటీలో జాయిను కావాలి. అనూరాధ ఉదయం ఆరుగంటలకే లేస్తూ ...

"ఆనంద్, ఈ రోజు మనం డ్యూటీకె ళ్లాలి, లే" అని లేపింది.

"అబ్బా, అనూ, అప్పుడే లేవాలా. ఇంకా నిద్రొస్తున్నది" "నువ్వు వంటచేసి తొమ్మిది గంటలకు లేపుదూ" అంటూ మళ్లీముసుగు తన్నాడు. కొత్త పెళ్లికొడుకు కదా, రాత్రంతా నిద్రలేదుకదా అనుకుని, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ పనులు మొదలెట్టింది అనూరాధ. తనకు కూడా నిద్ర లేదన్న సంగతి ఆమెకు ఆ సమయం లో గుర్తురాలేదు.

తొమ్మిది గంటలకు లేపితే స్నానం చేసి, భోంచేసి, ఆఫీసుకు వెళ్లడానికి తయారవుతు న్నాడు ఆనందరావు. అద్దంలో చూసుకుని తలదువ్వుకుంటూ తన వెనుకనే నిలబడిన అనూరాధతో...

"అనూ ఈరోజు సాయంకాలం వచ్చేట

ప్పుడు నీ ఎకౌంట్‌లోంచి పదివేల రూపాయలు తీసుకురా. నా దగ్గర కొంత వుంది. ఒక స్కూటరుకొనుక్కుంటే, ఇద్దరమూ ఆఫీసుకు వెళ్లడానికి సదుపాయంగా వుంటుంది''

''నా ఎకౌంట్లో పదివేలా ఎక్కడివి ఆనంద్''

''అదేంటి, నువ్వు ఇన్నాళ్లయి ఉద్యోగం చేస్తున్నావుకదా. నీ జీతం అంతా ఏమయింది. ఆడది, అందులో కన్న కూతురి సంపాదన తినేటంత నీచుడా, మీ నాన్న''

''నా జీతం, మా నాన్న తెచ్చే వేణ్ణీళ్లకు చన్నీళ్లయి, మా ఇద్దరు అక్కల పెళ్లిళ్లకు ఖర్చు అయినది. తర్వాత కొంచెం నిల్వచేస్తే మన పెళ్లికి ఖర్చు అయింది. అయినా ఆడదాని సంపాదన ఆశించడం ఎంత నీచమో ఎన్నో రచనలలో చెప్పిన నీవు ఇప్పుడు నాతో హాస్యమాడుతున్నావనుకుంటాను''

''అమా, హాస్యాలూ, సరదాలూ, సరసాలూ రాత్రిళ్లుకానీ, పగలు కాదు. సంసార రథానికి భార్యాభర్తలిద్దరూ చక్రాల్లాంటివారు అయినప్పుడు అవకాశముంటే, ఇద్దరూ సంపాదించి, ఆ రథాన్ని సాఫీగా నడపడానికి సహాయపడాలికదా. పెళ్లయిన తర్వాత భార్య బరువు బాధ్యతలను స్వీకరించిన భర్తకు, అవకాశమున్నప్పుడు భార్య సహాయపడాలంటే తప్పేముంది''

''భార్య సంపాదించి వుంటే, భర్త సంసారం గురించి ఖర్చు చేయడం తప్పనను అసలు ఆడది తన సంపాదన తన సంసారం గురించి ఖర్చు పెట్టకుండా ఏం చేసుకుంటుంది. కాని భార్య సంపాదనే పరమావధి అనిన్నీ, దానివల్ల తన అవసరాలు గడుపుకోవాలనీ అనుకోవడం సభ్యతా, సంస్కారం అనుకోను''

''చూడూ! సభ్యతా సంస్కారం గురించి నీవునాకు చెప్పనక్కరలేదు. ఎప్పుడైతే మగవాడు ఆడదానికి ప్రేమరక్షక సాంఘిక గౌరవంలాంటివి కల్పించడానికి తాలికడతాడో, అప్పుడే అతనికి ఆమెమీదా, ఆమె


## పొరపాటు

''సురేష్! ప్రక్కవీధిలో అమ్మాయినే పెళ్లిచేసుకోవడం పొరపాటయిందిరా?'' అన్నాడు రమేష్.

''ఏం? మాటి మాటికీ పుట్టింటికెళ్తోందా?'' అడిగాడు సురేష్.

''వెళ్తుంది. కానీ ఏం లాభం! వెంటనే తిరిగొచ్చేస్తోంది!'' చెప్పాడు రమేష్.

—ఎం.ఆర్.శకుంతల (సికిందరాబాద్)



సంపాదనమీదా సర్వాధికారాలు వస్తాయి''

''సరే ఆనంద్ మా నాన్న నా సంపాదన మీద ఆశ పెట్టుకోవడంలేదు. నువ్వు అధికారంతో అడిగినా అడగకపోయినా, ఇక ముందు నా సంపాదనకూడా అంతా మన సంసారానికే ఖర్చుపెడదాం. కానీ తాళికట్టించుకున్నందుకూ, ఆ రుణం తీర్చుకోడానికీ, ప్రతి ఆడదీ, తన సంపాదన భర్తకు ఇవ్వాలి అన్నావుకదా. అలాంటప్పుడు ఉద్యోగాలు వెయ్యని భార్యలు తమకు భర్తలద్వారా లభించిన ప్రేమ రక్షణ వగైరాలు ఏం ప్రతిఫలం ఇస్తారు''

''ఇక్కడ ప్రతిఫలం ఇవ్వడం పుచ్చుకోవడం అన్న సమస్యేలేదు. భార్య సంపాదనమీద, ఒక్క భర్తకే సంపూర్ణ అధికారం ఆటోమేటిక్‌గా వస్తుంది. పెళ్లికాకముందు సంపాదనపైకూడా. ఎందుచేతనంటే ఏ తండ్రీ తన కూతురి సంపాదనతో పబ్బం గడుపుకోవాలని చూడదు, చూడకూడదు. అందుకే నేను మీ నాన్నను ఏమీ కట్నకానుకలు అడగలేదు. ఎలాగూ నీ సేవింగ్స్ వుందికదా అని. మరొక్క విషయం. ఉద్యోగం చేసి సంపాదించినా, ఏ సంపాదనా లేకపోయినా, భర్త కముసన్నలలో మెలుగుతూ, ఆయన అవసరాలను, ఇష్టాలను తీర్చడం భార్య ధర్మమని గుర్తుంచుకో. గడచిన చరిత్ర ఇదే చెప్పింది. ఇప్పటి చరిత్ర ఇదే చెబుతున్నది. ఇకముందు చరిత్రకూడా ఇదే చెపుతుంది''

''అదికాదు ఆనంద్! నువ్వు వ్రాసిన 'జోడెద్దులు' అనే కథలో స్త్రీల స్థానాన్ని చక్కగా వివరించావు. ఆమె ప్రకృతిమాత ప్రతినిధి అనీ, సృష్టి కార్యానికి మూలం అవడంవల్ల, ఈ ప్రపంచంయొక్క అస్తిత్వానికీ ఆధారమనీ, ఆమె లేకపోతే సృష్టికి అంతం తప్పదనీ అన్నావు. స్త్రీ స్థానం పురుషునిస్థానంకన్నా ఎన్నో రెట్లు ఉన్నతమైనదనీ, పురుషుడు చేయగలిగే పనులనేకాక, పురుషుడు చేయలేని పనులనుకూడా స్త్రీ చేయగలదన్నావు. ఆమెను పురుషునితో సమానం అనడం, ఆమె స్థానాన్ని దిగజార్చి ఆమెను అవమానపరచడమేనన్నావు.

స్త్రీలు అక్కలుగా, చెల్లెళ్లుగా, భార్యలుగా, తల్లులుగా నిర్వహించిన పాత్రలవల్లే, ప్రతి మగవాడూ తన స్థానాన్ని సంతరించుకోగలుగుతున్నాడనీ, ఈ కృషిలో స్త్రీల పాత్ర సామాన్యం కాదనీ శ్లాఘించావు. అంత ఉన్నతమైన స్థానాన్నిచ్చిన స్త్రీని ఈనాడు బానిసగాభావించడం భావ్యమా''

''హియర్, హియర్. నీ జ్ఞాపకశక్తికి నా జోహార్లు. అవును, నిజంగా ఆ కథలో అలాగే రాశాను. ఫలితమేమిటో తెలుసా. ఎనిమిది పట్టణాలలో మహిళా మండలులచేత సన్మానాలూ, దుశ్శాలువలూ, బహుమతులూ, దిన, వార, మాసపత్రికలలో ఆ కథను పొగుడుతూ సమీక్షలూ, వ్యాసాలూ, అదే నేనాశించిందీ, సాధించిందీ''

''అయితే నీ దృష్టిలో స్త్రీ పురుషుడికంటే ఉన్నతమైనది కాకపోయినా, కనీసం సమానమైనదికూడా కాదన్నమాట''

''అనూ, ప్రకృతి స్త్రీలకు శారీరకంగా, మానసికంగా కొన్ని ప్రత్యేకతలు కల్పించింది. వాటిలో కొన్ని ఆమెను సృష్టికార్యానికి అనుగుణంగా మలిచి, మానవ ప్రవృత్తిని మంచి దిశగా పెంచడానికి తోడ్పడతాయి. కానీ వాటిలో కొన్ని ఆమె. స్వతంత్ర

జీవనానికి అవరోధాలవుతున్నాయి. ఈ అవరోధాలు మగవారివల్ల కల్పించబడ్డవే అనుకో.

అంతెందుకు, నీ ఈ పాతిక సంవత్సరాల జీవితంలో, మగవాడు అంటే తండ్రో అన్నో, తమ్ముడో, భర్తో, కొడుకో లేకుండా ఒంటరిగా జీవిస్తూ సుఖంగా వున్న ఆడవారిని ఎంతమందిని చూశావు. అంటే స్త్రీని మగవాడినుంచి రక్షించడానికి మగవాడి తోడు అవసరం అన్నమాట''

''అయితే పెళ్లికి పరమార్థం ఈ రక్షణేనా. పరస్పర అనురాగాలకీ, అభిమానాలకీ, అనుబంధాలకీ తావులేదా''

''స్థూలంగా ఆలోచిస్తే అంతే. దాని విలువా, ఫలితం నీకు త్వరలోనే అర్థమవుతాయి. నిన్ను ఇంతవరకూ రోడ్డుమీదా, బస్సు స్టాప్‌లోనూ, బస్సులలోనూ, ఆఫీసులోనూ చూసిన చూపులకూ, ఈరోజు చూసే చూపులకూ ఇచ్చే ట్రీట్‌మెంట్‌కూ భేదం నువ్వే తెలుసుకుంటావు. వివాహిత స్త్రీగా నీకు సమాజంలో గౌరవం ఆదరం, భద్రతా ఎంత ఎక్కువగా లభిస్తాయో నీవే తెలుసుకుంటావు''

''అయితే నీలాగే పగలంతా ఆఫీసులో పనిచేస్తూ నీతో సమానంగా జీతం తెస్తూ, ఈ సంసారం బరువు బాధ్యతలు భరించుతున్న నాకు మన కష్టసుఖాల్లో కుటుంబ గౌరవ మర్యాదల్లో సగభాగం లేదంటావా. ఒక చక్రంమీద ఎక్కువ బరువు మోపడం రెండో చక్రానికి న్యాయమా? రెండు చక్రాలూ బండి భారాన్ని సమానంగా మొయ్యాలికదా''

''నీ మనస్సులో వున్నమాట సూటిగా అడుగు! నేను నిన్ను పెళ్లాడినందుకూ, నీ సేవలు చేస్తున్నందుకూ, నీ ఇష్టాల్ని తీరుస్తున్నందుకూ, నాకు సాంఘిక రక్షణా, భద్రతా, ఇంకా ఏవేవో కల్పిస్తున్నానన్నావు. అటువంటప్పుడు నా జీతం నీకు ఎందుకు ఇవ్వాలి. లేదా అంటే నువ్వుకూడా నాలాగే ఇంట్లో పనిచెయ్యి'' అంటావు.. ఉదయం నువ్వు

## తృప్తి



'ఫారూఖ్ ఖాన్' ఇపుడో పేరున్న మంచినటుడు. అయితే అతగాడికి దేశంలో అందరికంటే ఎక్కువ పారితోషికం తీసుకునే 'నెంబర్ వన్' నటుడవ్వాలనే కోరిక లేనే లేదట. ఇప్పటికే నిర్మాతలు నాకు చాలా ఎక్కువగా డబ్బు ఇస్తున్నారనికూడా అతడంటున్నాడు. అదంటే తృప్తంటే... మరి మిగిలిన నటీనటులుకూడా ఇతడి దారిలో నడిస్తే సినీ పరిశ్రమ కొన్ని సంవత్సరాలు బ్రతికి బట్టకట్టగలదు.

— జూపిటర్

నన్ను లేపినప్పుడే అనుకున్నాను. నీ మనసులో అలాంటి ఆలోచనే వున్నదని"

"అబ్బే, అదికాదు ఆనంద్"

"చూడు అనూ, కొందరు తప్పక చేయాలి. అలా చేయడం వారి విధి. అలా చేస్తేనే రాణింపు. నా రచనా వ్యాసంగం ఇతర వ్యాపకాలవల్ల నేను రాత్రిళ్ల లేటుగా పడుకుని ఉదయం తొమ్మిదికే లేస్తాను. అంచేత ఈరోజులా ప్రతిరోజూ జరగాలి. మరొకమాట. నువ్వుకూడా, పాపం ఉద్యోగం చేస్తున్నావుకదా అని ఏమైనా లోటుపాట్లుంటే సర్దుకుపోతాను అనుకోకు. నా సుఖం, సంతోషం, ఆనందంలో ఏ లోపం జరిగినా సహించను. ఉద్యోగం చేస్తున్నా, నువ్వుకూడా అందరు ఆడవాళ్లలాగే మెలగాలి. ఏవేవో ఊహించుకుని లేనిపోని ఆశలుపెట్టుకోకు"

"అయితే, స్త్రీ స్వాతంత్ర్యమూ, ప్రాముఖ్యతా, సమానత్వమూ మొదలైన ఆదర్శాలగురించి నీవు వ్రాసినవన్నీ..."

"అదిగో మాటిమాటికీ ఆ రాతల ఊసెత్తవద్దన్నానా. ఆ రాతల ఆశయమేమిటో ఇందాకే చెప్పానుకదా. మాటలను చేర్చి వాక్యాలూ, వాక్యాలనుచేర్చి కథలూ అల్లడంలో నేర్పు చూపించి ఏదో వ్రాస్తాం. అదొక వృత్తి. దానికి ప్రతిఫలం డబ్బూ, కీర్తీ, పేరు, ప్రతిష్ట. కాని ఆ రాసిన ఆదర్శాలూ, ఆశయాలూ అమలుపరచాలంటే జరిగేపనేనా?"

"అంటే ఆత్మవంచనతో డబ్బుకోసం అలా రాశావన్నమాట. నీ రాతలలో నిజాయితీ లేదన్నమాట"

"చెప్పానుగా, అంతేననీ. మరో విషయం ఆలోచించు. రోజూ మనం బ్యాంకులో లక్షలకు లక్షలు ఇస్తుంటాం. పుచ్చుకుంటుంటాం. ఆ డబ్బంతా మనదేనా? కాదే. అలా ఇచ్చి పుచ్చుకోవడానికి మనకి బ్యాంకు జీతం ఇస్తుంది. అంతే. ఆదర్శాలూ, ఆశయాలూ, ధర్మసూక్ష్మాలూ చెప్పడమన్నా అంతే. రాయడం చెప్పడం పేరో డబ్బో ఏదో సంపాదించుకోవడం. అంతవరకే"

"మీ రచనలవల్ల స్త్రీలు ఎంత ఉత్తేజితులై రంగు రంగుల కలలు కంటూ, తమ భావిజీవితంమీద ఎటువంటి ఆశలు పెంచుకుంటున్నారో తెలుసా?"

"తెలుసు. అలా ఎంత చక్కటి రంగురంగుల కలలు కనేటట్టు చేయగలిగితే అంత గొప్ప రచయితన్నమాట. అంతవరకే. చూడు అనూ, తాపీ మేస్త్రి ఇటుకలను రకరకాలుగా పేర్చి, అందమైన మేడ కడతాడు. వ్రడంగి, రంగులవాళ్లు అంతా దాన్ని బాగా అలంకరిస్తారు. దానికి వాళ్లకు కూలి ముడుతుంది. కాని వాళ్లు దానిలో నివసించరుకదా. ఇదీ అంతే. రచయితలు మాటల మేడలుకడతారు. కాని వాట్లో నివసించరు"

"తను ఆచరించనప్పుడు, ఆదర్శాలు, ఆశయాలూ వల్లించి ప్రజలను మోసం చెయ్యడం తప్పుకాదా, తాను చెప్పినవి ఆచరించడం అతని ధర్మంకాదా! అలా చెయ్యనప్పుడు ప్రజలకు అతని రచనలవల్ల ఏం ప్రయోజనం చేకూరుతుంది"

"పిచ్చి అనూ, డాక్టరు ఆరోగ్య సూత్రాలు నేర్చుకుంటాడు. పల్లె వేస్తూ వుంటాడు. అంతమందికీ చెబుతుంటాడు. కాని ఎంతమంది డాక్టర్లు సిగరెట్టు కాల్చడం, మందుకొట్టడం మానేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అసలు వారు తాము

చెప్పే ఆరోగ్యసూత్రాలు పాటిస్తే వారికి రోగాలూ, మృత్యువూ రాదుకదా. అలాగే లాయర్లున్నారు. చట్టాలూ, న్యాయం, అన్యాయం అన్నీ వారికి తెలుసు. కోర్టులో వాదిస్తారు. కానీ తమకు తెలిసిన న్యాయాన్నే అనుసరిద్దామనుకుంటే ఎంతమంది తమ వృత్తిలో రాణిస్తారు. అలా నమ్ముకున్నవారి ప్రాక్టీసు చట్టుబండలే అవుతోందికదా.

చూడు అనూరాధాదేవీ. ఇప్పటికే చాలా వర్ణలు జరిపాము. మన మనసులలోని భావాలను విప్పిచెప్పుకున్నాము. నా మనసులోని భావం నీకు పూర్తిగా అర్థం అయి వుంటుందనుకుంటాను. ఇంకా వివరంగా విప్పిచెప్పడానికి నాకు ఓపికా టైమూ లేవు. అందుచేత ఏం చేస్తావో, ఎలా తెస్తావో, మీ నాన్న ఇంటినమ్మి తెస్తావో, నాకు తెలియదు. తన పెన్షను పెట్టుకుని ఏదో అద్దెకొంపలో పడుంటాడు. ఆ డబ్బు తీసుకురాకపోతే, అడిగినప్పుడు డబ్బు తీసుకురాని భార్యలను, భర్తలు ఏం చేస్తారో నేను నా నోటితో చెప్పను. నా నవలలూ, కథలూ ఎన్నో చదివావుకాబట్టి నీకు ఆలోచిస్తే తప్పక అర్థం అవుతుంది'' అంటూ విసురుగా బయటకు వెళ్లిపోయాడు ఆనందరావు. ఆదర్శాల వలలో తానెలా చిక్కుకుపోయి మోసపోయిందో ఆలోచిస్తూ, బేంకుకు వెళ్లడంకూడా మరిచిపోయి, కూలబడిపోయింది అనూరాధ.

◇ ◆ ◇

